నమస్తే తెలంగాణ

# హెచ్ఎంఆర్ఎల్‌కు గార్డెన్ అవార్డులు




సిటీబ్యూరో, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ ఎనిమిది అవార్డులను సొంతం చేసుకున్నది. తెలంగాణ హార్టికల్చర్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గార్డెన్ ఫెస్టివల్-24 వేడుకల్లో ఉత్తమ ల్యాండ్ స్కేపింగ్ కేటగిరీలో 8 గోల్డ్ గార్డెన్స్ అవార్డులు, రోలింగ్ ట్రోఫీని గెలుచుకున్నది. గడిచిన ఆరేండ్లలో హెచ్ఎంఆర్ఎల్ అత్యుత్తమ అవార్డులను కైవసం చేసుకుంటూనే ఉంది. నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్‌లో గురువారం జరిగిన అవార్డు ప్రదానం వేడుకలో హార్టికల్చర్ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా చేతుల మీదుగా అవార్డులను హెచ్ఎంఆర్ఎల్ హార్టికల్చర్ అధికారులు తీసుకున్నారు. వైవిధ్యమైన రూఫ్ టాప్ గార్డెన్ల నిర్వహణతో వరుస అవార్డులను మెట్రో సంస్థ గెలుచుకుంటుందని, పర్యావరణ పరిరక్షణలో, పచ్చదనం పెంపొందించేందుకు వినూత్న విధానాలను అవలంబిస్తామని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. తమకున్న పరిమితమైన స్థలాల్లోనే థీమ్ బేస్డ్ గార్డెన్లను అభివృద్ధితో అవార్డులను గెలుచుకోవడంపై సిబ్బందిని ఆయన ప్రశంసించారు.